# ‘ప్రజావాణి’తో సమస్యల పరిష్కారం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- 261 దరఖాస్తుల స్వీకరణ

కలెక్టరేట్, జూన్ 23 : ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 261 దరఖాస్తులు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకు 106, హౌసింగ్ శాఖకు 53, డీఆర్డీవోకు 34, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి 14, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు 12, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారికి ఐదు చొప్పున, జిల్లా వ్యవసాయ అధికారికి నాలుగు, సెస్ కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ వేములవాడకు మూడు చొప్పున, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్, ఎస్పీ కార్యాలయం, ఎస్సీ కార్పొరేషన్, అటవీశాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ, ఎంపీడీవో గంభీరావుపేట, జీఎం ఇండస్ట్రీస్, జిల్లా వైద్యాధికారి, వేములవాడ రాజన్న ఆలయ ఈవోకు రెండు చొప్పున, ఎంపీడీవో ముస్తాబాద్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభా య్, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### వితంతు పెన్షన్ ఇప్పించాలి


లక్ష్మి (వితంతువు)

ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పొన్నాల లక్ష్మి వితంతువు తనకు పెన్షన్ ఇప్పించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కోరింది. తన భర్త వెంకట్‌రెడ్డి 5 ఐండ్ల క్రితమే చనిపోయాడని, ఇప్పటి వరకు తనకు వితంతు పెన్షన్ అధికారులు మంజూరు చేయడం లేదని, పెన్షన్ మంజూరయ్యేలా అధికారులను ఆదేశించాలని కలెక్టర్‌ను కోరింది.

### పోషణ చూడడం లేదని వృద్ధుడి ఫిర్యాదు


గౌరయ్య

ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన అమ్ముల గౌరయ్య (78) తన కొడుకులు తన పోషణను సరిగా చూ డడం లేదని కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. తన పేరిట ఉన్న భూ మిని ఇద్దరు కొడుకులకు సమానంగా ఇచ్చానని, అ యినా పెద్ద కొడుకు ఏ అశోక్ తనను డబ్బుల కోసం మానసిక, శారీరకంగా వేధిస్తూ తనపై దాడి చేస్తున్నాడని తెలిపాడు. పెద్ద కుమారుడు అశోక్ భార్య పేరిట చేసిన వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ రద్దు పరిచి.. తన పేరిట మార్పించాలని వేడుకున్నాడు.


కలెక్టరేట్‌లో బైఠాయించిన ఇల్లంతకుంట మండల రైతులు

### కలెక్టరేట్‌లో రైతుల బైఠాయింపు ..

కలెక్టరేట్, జూన్ 23 : పొద్దు తిరుగుడు పంట తూకంలో అధికారులు తరుగు పేరుతో కటింగ్ పెడుతూ రైతుల పొట్ట కొడుతున్నారని ఇల్లంతకుంట మండల రైతులు కలెక్టరేట్‌లో సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. తాళ్లపల్లి, పత్తికుంటపల్లి, కేశన్నపల్లె, ముస్కానిపేట, గాలిపెల్లికి చెందిన రైతులు కొనుగోలు చేసిన పొద్దు తిరుగుడు పంట తూకంలో తరుగుతో కటింగ్ చేయడమేంటని వాపోయారు. కలెక్టర్ ఆదేశాల మేరకు.. డీఆర్డీవో శేషాద్రి విచారణ చేపడతామని చెప్పినా ఇప్పటి వరకు ఎలాంటి రిపోర్టు ఇవ్వకపోవడంపై అధికారుల తీరుపై మండిపడుతూ కలెక్టరేట్‌లో రైతులు బైఠాయించి, అధికారులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## స్వయం సహాయక మహిళలకు చీరెలు

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**


గోదాములో చీరెలను కలెక్టర్‌తో కలిసి పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల జూన్ 23 (నమస్తే తెలంగాణ) : నేతన్నలకు చేతినిండా పనికల్పిస్తూనే స్వయం సహాయక సంఘాల మహిళలకు నాణ్యమైన చీరెలను పంపిణీ చేయనున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మరమగ్గాలపై తయారైన ఇందిరమ్మ చీరల నాణ్యతను చేనేత జౌళీశాఖ గోదాములో సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సిరిసిల్లలో చీరలు తయారు చేయడం గర్వకారణమన్నారు. నేతన్నలు, రైతన్నల సంక్షేమమే ఏజెండాగా ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ధార్మిక కార్మిక క్షేత్రంగా నిలిచిపోతుందన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుర్తు చేశారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, సిరిసిల్ల చేనేత కార్మికులకు కేటాయించిన చీరెల ఆర్డర్‌ను సకాలంలో పూర్తి చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. జూన్ నెలాఖరు నాటికి సగం ఉత్పత్తులు డెలివరీ పూర్తి చేయాలని, చేనేత కార్మికులకు అవసరమైన నూలు వేములవాడ డిపో నుంచి ఇవ్వడం జరుగుతుందన్నారు.

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE I-ADDL JUNIOR CIVIL JUDGE AT SIRCILLA.**
**O.S.No. 279 of 2020**
Between:-
Katta Guruva Reddy ...Plaintiff
AND
1.Balreddy gari Bal Reddy
2.The secretary, Grampanchayath, Vallmpatla Village
3.In Re (whom so ever so concerned) ...Defendants
To,
R3. In Re (To whom so ever so concerned)
Whereas the above named plaintiff filed above Refered suit against the defendants mentioned above for declaration that, the Plaintiff only class-II Legal heir of deceased katta Manemma W/o. Late Katta Venkat Raji Reddy.
Take notice that the above suit is posted on : 27-06-2025 at 10-30 A.M. for the appearance of the Parties " who are interested and concerned to the subject matter of the suit" be fore this Hon'ble court in Person or through duly authroized Advocate, Failing which the matter would be adjudged in your absence.
// By order of the Court //
Sd/- **MARUPAKA RAMESH**
Advocate for the Plaintiff
advocate Sircilla Cell: 9490860010

## తీసేసినా అదే అజమాయిషీ

- దుమాల ఈఎంఆర్ఎస్‌లో పాత ప్రిన్సిపాల్ దే రాజ్యం
- బాధిత సిబ్బంది విధుల్లోకి చేరేందుకు వెళ్తే తిప్పి పంపిన వైనం
- పాఠశాల ఎదుట బాధితుల ఆందోళన
- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు ఇచ్చినా పట్టింపుకరువు


దుమాలలో నిరసన తెలుపుతున్న టీచింగ్ స్టాఫ్

ఎల్లారెడ్డిపేట, జూన్, 23: విధుల్లో నిర్లక్ష్యం, పాలనలో లోపం కారణంగా వేటుపడ్డా దుమాల ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ మంజీత్ మళ్లీ అజమాయిషీ చెలాయిస్తున్నాడంటూ స్కూల్లో నుంచి తీసేయబడ్డ టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది ఆరోపించారు. సోమవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఇటీవల పాఠశాలలో విధుల్లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది 12 మందిలో 10 మందిని నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన కారణంతో ప్రిన్సిపాల్ మంజీత్‌ను విధుల నుంచి తప్పిస్తూ ఈ నెల 19న టీజీ ఈఎంఆర్ఎస్ సొసైటీ సెక్రటరీ సీతామహాలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అలాగే అతని స్థానంలో మరిమడ్ల ప్రిన్సిపాల్ రామ్‌సూరత్ యాదవ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చిన విషయం విధితమే. అయితే పాఠశాల చివరి వర్కింగ్‌డే వరకు విధుల్లో ఉన్న సిబ్బందిని తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొని ఉండగా, సోమవారం పాఠశాలకు వెళ్లామని వారు చెప్పారు. అక్కడ మళ్లీ పాత ప్రిన్సిపాల్ మంజీతే ఉన్నారని, తమను చూసి స్కూల్‌కు ఎందుకు వచ్చారని బెదిరించారని, మళ్లీ అప్లై చేసుకొని రావాలని తిప్పి పంపారని ఆగ్రహించారు. మర్రిమడ్ల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు అప్పగించినా, మళ్లీ పాత ప్రిన్సిపాలే ఎందుకు ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. కాగా, విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకొని నిరసన చేస్తున్న బాధితులను సముదాయించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో మాట్లాడాలని సూచించడంతో వారు అక్కడి నుంచి మర్రిమడ్ల ఈఎంఆర్ఎస్‌కు వెళ్లారు. కాగా, పాత సిబ్బంది సక్రమంగా పనిచేస్తున్నా పట్టుబట్టి కొత్త సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వడం వెనక ఇంకేదైనా కారణం ఉందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, దీనిపై రీజనల్ కో-ఆర్డినేటర్ డీఎస్ వెంకన్నను వివరణ కోరగా బాధ్యతల నుంచి తప్పించిన మంజీత్ విషయాన్ని, తొలగించిన సిబ్బందిని తీసుకోవాలనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

### బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు డ్రా ద్వారా ఎంపిక

కలెక్టరేట్, జూన్ 23 : బెస్ట్ అవైలెబుల్ స్కూల్స్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి తేదీ 23-06-2025 (సోమవారం) లాటరీ పద్ధతి ద్వారా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమక్షంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. 2025-26 విద్యా సంవత్సర మునకు బెస్ట్ అవైలెబుల్ స్కూల్స్ పథకం ద్వారా 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్) ఇంగ్లిష్ మీడియం స్కూల్స్‌లో ప్రవేశానికి రాజన్నసిరిసిల్ల జిల్లాలో 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్)లో దరఖాస్తులు పూర్తి స్థాయిలో మొత్తం (114) రాగా, అందులో 1వ తరగతికి 33 శాతం బాలికల రిసర్వేషన్ ప్రకారంగా (19) సీట్లు, జనరల్ కేటగిరిలో (27) సీట్లు మొత్తం (46) సీట్లను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. ఎస్సీ అభివృద్ధి అధికారి బీ రాజామనోహర్ రావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ వినోద్ కుమార్, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల కో ఆర్డినేటర్ జాస్మిన్ థెరిస్సా, సహాయ ఎస్సీ సంక్షేమాధికారి విజయ లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రైవేట్ స్కూల్ వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు


ప్రైవేట్ స్కూల్ వ్యాన్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

చందుర్తి, జూన్ 23 : మండలంలోని బండపల్లి గ్రామంలో ప్రైవేట్ స్కూల్ వాహనాలను గ్రామస్తులు, ఉపాధ్యాయులు సోమవారం అడ్డుకున్నారు. బండపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని ఉపాధ్యాయులు భరోసా కల్పించడంతో వేములవాడ పట్టణానికి చెందిన, కోనరావుపేట మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన పలు ప్రైవేట్ పాఠశాలల వాహనాలను అడ్డుకొని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. ప్రాథమిక పాఠశాలలో 25 మంది నూతనంగా అడ్మిషన్ పొందినట్లు ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్, ఆనంద రెడ్డి పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ కటుకం మల్లేశం, అంగన్‌వాడీ టీచర్ బుర్ర రేణుక, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బడికి పోయిన కొడుకు ఇంటికే రాలేదు

- మిన్నంటిన తల్లి (పెద్దమ్మ) రోదన
- ఎల్లారెడ్డిపేటలో ఘటన

ఎల్లారెడ్డిపేట, జూన్ 23: చిన్ననాడే తల్లిని, తండ్రిని పోగొట్టుకున్న ఓ బాలుడిని అన్నీ తానై చూసుకున్న ఓ మహిళ పెంచిన కొడుకును బడికి పంపించగా, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆ పెంపుడు తల్లి రోదనలు మిన్నంటాయి. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లకు చెందిన జరీన-షాదుల్‌కు కుమారుడు తాజొద్దీన్(8) జన్మించాడు. అన్యోన్యంగా ఉన్న చిన్న కుటుంబంలో 2021లో వచ్చిన కరోనా మహమ్మారితో జరీనా-షాదుల్ మృతి చెందారు. దీంతో తాజొద్దీన్‌ను తాత ఖాదర్, పెద్దమ్మ జకియా ఎల్లారెడ్డిపేటలో నివాస ముంటున్నారు. బాలుడిని కిషన్‌దాస్‌పేటలో మూడో తరగతి చదివిస్తున్నారు. రోజూ మాదిరిగా తాజొద్దీన్ సోమవారం ఉదయం బడికి పంపగా.. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఉపాధ్యాయులను, ఇరుగు పొరుగువారిని అడిగినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. సీసీ పుటేజీలను వెతికినా ఎలాంటి సమాచారం దొరకలేదు. దీంతో జకియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

### చందుర్తి ఎంపీడీవోగా రాధ

చందుర్తి, జూన్ 23 : మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా ఎల్ రాధ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కరీంనగర్ డీఆర్డీఏ కార్యాలయంలో విధులు నిర్వర్తించిన రాధా ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. చందుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న ప్రదీప్‌కుమార్ నుంచి బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

## డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములవ్వాలి : ఎస్పీ


డ్రగ్స్ నిర్మూలనకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, యువత, విద్యార్థులు

రాజన్న సిరిసిల్ల, జూన్ 23 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ నిర్మూలన ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎస్పీ మహేశ్ బీ గితే పిలుపు నిచ్చారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూసే బాధ్యతను చేపట్టి భావితరాలకు మంచి భవిష్యత్‌ను అందించాలన్నారు. ప్రతి విద్యార్థి, యువత యాంటీ డ్రగ్ సోల్జర్‌గా మారాలన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అవగాహన వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన టూకే రన్ విజయవంతమైంది. భారీ సంఖ్యలో యువత, విద్యార్థులు, అధికారులు పాల్గొని డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిద్దామంటూ ప్రతిజ్ఞ చేశారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు రన్ నిర్వహించి, ఘాట్ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు, యువత, విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ప్రతి విద్యార్థి, యువత యాంటీ డ్రగ్ సోల్జర్‌గా మారి మాధకద్రవ్యాల వలన కలుగు అనర్థాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని గుర్తు చేశారు. గంజాయి అక్రమ రవాణా లాంటి మత్తుపదార్థాలకు సంబందించిన సమాచారాన్ని తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో ఫోన్ నంబర్ 8712671111కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సీఐలు మొగిలి, నాగేశ్వరరావు, నటేశ్, మధుకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవి, ఆర్ఐలు మధుకర్, రమేశ్, ఎస్ఐలు కిరణ్‌కుమార్, రామ్మోహన్, శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రీనివాస్,ఆర్ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

రుద్రంగి, జూన్ 23 : భవిష్యత్ తరాలకు డ్రగ్స్ రహిత సమాజాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎస్ఐ మోతీరామ్ అన్నారు. డ్రగ్స్ వ్యతిరేక వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఎస్ఐ మోతిరాం మాదక ద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి పోలీస్ స్టేషన్ నిర్మాణం కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోతిరామ్ మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి నివారణలో యువత భాగస్వాములు కావాలన్నారు. మత్తులో నేడు యువత అనేక నేరాలు చేస్తున్నారన్నారు. డ్రగ్స్ సేవించిన, సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, గంజాయి, డయల్ 100 వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


రుద్రంగిలో మొక్క నాటుతున్న ఎస్ఐ మోతిరామ్

వేములవాడ రూరల్, జూన్ 23: మండలంలోని నూకలమర్రి గ్రామంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా అరికట్టాలనే నినాదంతో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని నూకలమర్రి గ్రామంలో జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే అదేశాల మేరకు.. మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించామన్నారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏదైనా సమాచారం తెలిస్తే 1908కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అంజయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డీఆర్డీఏ శేషాద్రిని కలిసిన ఇఫ్కో ప్రతినిధులు

కలెక్టరేట్, జూన్ 23: రాజన్న సిరిసిల్ల జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శేషాద్రిని కరీంనగర్ జిల్లా సమగ్ర రైతు సహకార సంస్థ (ఇఫ్కో) ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ కార్యాలయంలో ఆయన పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టబోయే ఇఫ్కో కార్యక్రమాలపై జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జీ స్వప్నరెడ్డి వివరించారు. మహిళా సాధికారత, ఆర్థిక అక్షరాస్యత కోసం స్వయం సహాయక బృందాలైన (SHG) మహిళలకు జీవనోపాధి మార్గాలను కల్పించడంలో ఇఫ్కో (IFCO) కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వారి శ్రద్ధాసక్తులకనుగుణంగా వివిధ రకాల వస్తువుల తయారీలో శిక్షణ ఇవ్వడం, వారిలో సామర్థ్యాన్ని పెంచి ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందించే రుణ సదుపాయాన్ని సక్రమమైన మార్గంలో వినియోగించి ఉపాధిని పెంచేందుకు కావాల్సిన నైపుణ్యాన్ని అందించడం, వారు తయారు చేసేలా వస్తువులను బహిరంగ విపణిలో విక్రయించుటకు తగిన మార్కెట్ మెలకువలను తెలియజేసి వారికి ఆర్థిక లాభాలు వచ్చేలా ప్రో త్సహిస్తామన్నారు. అభివృద్ధికి దోహదపడేలా ఇఫ్కో పథకాలు మహిళలకు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇఫ్కో అడ్మిన్ మేనేజర్ భాగ్యలక్ష్మి, డివిజన్ మేనేజర్ జింక నాగరాజు, ఎం ఈఒలు సాదియా, లక్ష్మణ్, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


మంటలను ఆర్పుతున్నన్న ఫైర్ సిబ్బంది

వేములవాడ రూరల్, జూన్ 23 : మండలంలోని హన్మాజీపేటలోని మాజీ సర్పంచ్ గొర్రె రాజవ్వ, మైసయ్యకు చెందిన ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధం కాగా, దాదాపు ఇరువై లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. సోమవారం గొర్రె మైసయ్య వేములవాడకు వెళ్లగా కుటుంబసభ్యులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చేలరేగడంతో స్థానికులు గుర్తించి, ఫైర్ ఇంజిన్‌కు ఫోన్ చేశారు. కాగా, మంటలు వచ్చే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా, ఫైర్ ఇంజిన్ వచ్చి సిబ్బంది మంటలు ఆర్పిన అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైయింది. బీరువాలోని ఉన్న దాదాపు రెండు లక్షల నగదు, మూడు తులాల బంగారం అగ్నికి అహుతైయింది. కాగా, ఇటీవల మైసయ్య కొడుకు రఘు అనారోగ్యం చెందగా, సీఎం రిలీఫ్ ఫండ్ వచ్చిన డబ్బులను బీరువాలో పెట్టామని, దాంతో పాటు మరో రెండు లక్షలు, బంగారం కాలీ పోయిందని బాధితులు రోదిస్తూ గోడు వెల్లబోసుకున్నారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో వంట సామగ్రితో పాటు వస్తువులు కాలీ పోయాయి. ఇంటిపై కప్పు, ఇంటి దర్వాజ, డోర్లు ఇలా అన్ని కాలిపోవడంతో ఇల్లు ఉండేదుకు కూడా వీలులేకుండా ఉండడంతో పెద్ద ఎత్తున్న స్థానికులు వచ్చి కుటుంబసభ్యులకు భరోసాను కల్పించారు. ఫైర్ అధికారులు అనిల్ అధ్వర్యంలో మంటలను అర్పడంతో పాటు రెవెన్యూ అధికారులు ఇంటి నష్టంపై సర్వే చేశారు. ఇంటి యాజమాని వేములవాడకు పోయి వచ్చే వరకు ఇల్లు పూర్తిగా మంటల్లో కాలిపోవడంతో కుటుంబసభ్యుల రోధనలు స్థానికులను కలిచివేశాయి. ప్రభుత్వం మైసయ్య కుటుంబాన్ని అదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### మత్తు పదార్థాల నియంత్రణకు సహకరించాలి: ఎస్పీ

ఇల్లంతకుంట, జూన్ 23 : మత్తు పదార్థాల నియంత్రణకు అందరూ సహకరించాలని ఎస్పీ మహేశ్ బీ గితే అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅథితిగా ఎస్పీ, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ, మత్తు పదార్థాల నియంత్రణకు అందరూ సహకరించాలన్నారు. విద్యార్థి దశ ప్రతి ఒక్కరికీ కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరియావరణాన్ని కాపాడడంలో భాగస్వాములు కావాలన్నారు. సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్ఐ సిరిసిల్ల అశోక్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### బాధితులకు సత్వర న్యాయం చేయడానికే ‘గ్రీవెన్స్ డే’

తెలంగాణ చౌక్, జూన్ 23: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ప్రతి ఫిర్యాదుపై బాధితులకు సత్వర న్యాయం అందించేలా గ్రీవెన్స్ డే ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎస్పీ స్వయంగా అందుబాటులో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తూన్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్జీదారులన నుంచి 36 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి, బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిషారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలన్నారు.

### బాధితులకు బీఆర్ఎస్ నాయకుల అండ

వేములవాడ రూరల్, జూన్ 23 : వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం కాగా, బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ మండలాధ్యాక్షుడు గొస్కుల రవి, వేములవాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు 50 కేజీల బియ్యం, ఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ జంకె విజయ శ్రీనివాస్‌రెడ్డి 25 కేజీల బియ్యం, రెండు వేయిలను అందజేశారు. అలాగే మర్రిపల్లి మాజీ సర్పంచ్ రూ.5 వేలను బాధిత కుటుంబాలను అందజేసి అండగా నిలిచారు. మాలాగే మిగితా వారు బాధిత కుటుంబానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

### టీబీ ముక్త్ భారత్ అభియాన్

ఎల్లారెడ్డిపేట, జూన్ 23 : మండలకేంద్రంలో వైద్యాధికారి సారియా అంజుమ్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంపును నిర్వహించారు. మంగళవారం క్యాంపును ప్రారంభించి ఆమె మాట్లాడారు. షుగర్, క్యాన్సర్, బీపీ, దీర్ఘకాలిక వ్యాధులు, పొగాకు తీసుకునే వారిలో క్షయ వ్యాధికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉన్నాయని, క్షయ లక్షణాలున్న వారిని గుర్తించి తెమడ పరీక్షలు చేయించామన్నారు. టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ నాగరాజు, టీబీ సూపర్వైజర్ మహిపాల్, కౌన్సిలర్ సురేశ్, ఎల్టీ సురేశ్, హెచ్ఏ బాబు, హెచ్ఎస్ పద్మ, సిబ్బంది పద్మజ, ఎంఎల్‌హెచ్‌పీ శిల్ప, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.


### జయశంకర్ విగ్రహానికి స్థలం కేటాయించాలి

గంభీరావుపేట, జూన్ 23 : ప్రత్యే తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు మండల కేంద్రంలో స్థలం కేటాయించాలని మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మండలాధ్యక్షుడు వేణుగోపాల్, సభ్యులు ఆంజనేయులు, దేవేందర్, అల్లెపల్లి రాజారాం, రమేశ్, నరేశ్, దేవరాజు, బ్రహ్మం, చంద్రమౌళి పాల్గొన్నారు.

### గంభీరావుపేట డెయిరీ నూతన కార్యవర్గం

గంభీరావుపేట, జూన్ 23 : గంభీరావుపేట పట్టణ కరీంనగర్ డెయిరీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంట రమేశ్, డైరెక్టర్లుగా కోటయ్యగారి రాజేంద ర్‌రెడ్డి, గంట శ్రీనివాస్, బరిగెల మహేశ్, నర్సింలు, రాములు, సంజీవ్, లింగం, ముత్యంరావు, లక్కిరెడ్డి సుభాష్ రెడ్డిని ఎన్నుకున్నారు. పాడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

### వేములవాడ ఏడీఈగా అనిల్ కుమార్


బాధ్యలు తీసుకుంటున్న అనిల్ కుమార్


వేములవాడ, జూన్ 23: వేములవాడ సబ్ డివిజన్ సెస్ ఏడీఈగా అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వే ములవాడలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీధర్ తంగళ్లపల్లికి బదిలీ కా గా,జగిత్యాలనుంచి అనిల్‌కుమార్ వేములవాడ బదిలీపై వచ్చారు.

### రాజన్న ఆలయంలో లైవ్ టీవీల ఏర్పాటు


లడ్డూ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన లైవ్ టీవి

వేములవాడ టౌన్ , జూన్ 22 : వేములవాడ రాజన్న దర్శనార్థం వచ్చే భక్తుల కోసం ఆలయంలో లైవ్ టీవీలను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో రాధాబాయి తెలిపారు. ఆలయంలోని క్యూలైన్లలో, లడ్డూ కౌంటర్ తదితర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం లైవ్ టీవీలను ఏర్పాటు చేశామని, దీంతో నిత్యం ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాల వివరాలతో కూడిన సమాచారం, భక్తుల రద్దీ ప్రత్యక్ష ప్రసారమవుతుందని, భక్తులు రాజన్న ఆలయానికి సంబంధించిన వెబ్సైట్‌తో పాటు యూట్యూబ్ ఛానల్ సైతం ఫాలో కావాలని వారు వెల్లడించారు.

### వన్యప్రాణుల మాంసం విక్రయిస్తే చర్యలు


తనిఖీలు చేస్తున్న అధికారులు

వేములవాడ రూరల్, జూన్ 23 : హోటళ్లలో వన్యప్రాణుల మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వేములవాడ అటవీశాఖ అధికారి అఫ్జల్ హుస్సేన్ హెచ్చరించారు. సోమవారం హన్మాజీపేట, పట్టణంలోని నాంపెల్లి గ్రామాల్లోని హోటళ్లను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హోటళ్లలో వన్యప్రాణుల మాంసంను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు.. తనిఖీలు చేశామన్నారు. అటవీ జంతువులను వధించి, మాంసం విక్రయిస్తే హోటళ్లను సీజ్ చేస్తామన్నారు. అనంతరం హోటళ్లను తనిఖీలు చేశారు. సాహెబ్‌హుస్సేన్, ప్రసాద్ పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

చందుర్తి,జూన్ 23 : చందుర్తి పోలీస్ స్టేషన్‌లో హరితహారంలో భాగంగా సోమవారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై జిల్లాల రమేశ్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో మొక్కలు నాటారు, ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్లో మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
**PASSPORT LOST**
★ Chippa Naresh S/o.Chippa Rajesham H.No. 1-34, R/o. Sriramulapally, Koheda Mandal Karimnagar Dist. My Pass Port No. K1413328 Lost By Travelling at Sircilla old Busstand. If any one found Please Call : 9963710853
NTK-330349

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189